క్లుప్తంగా

జర్నలిస్టులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



రాకేశ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్: జర్నలిస్టులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం తిమ్మాపూర్ మండల ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నూతన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే సత్కరించారు. అనంతరం సీనియర్ జర్నలిస్ట్ దూసేటి మహేందర్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రభుత్వం ప్రజలకు వారధిగా ఉండే జర్నలిస్టులకు ఎన్నో సమస్యలున్నాయని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రెస్‌క్లబ్ తిమ్మాపూర్ అధ్యక్షుడు బత్తుల రాకేశ్(సాక్షి), ప్రధాన కార్యదర్శి బొట్టు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు నాగెల్లి ఆంజనేయులు, ఎండీ రహీం, గౌరవ అధ్యక్షుడు ముస్కు లక్ష్మారెడ్డి, జిల్లా ఈసీ మెంబర్ సిరిసిల్ల అనిల్, సలహాదారు వేల్పుల రాజు, కోశాధికారి ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శి కొంపల్లి సతీష్, బూమాడి శ్రీధర్‌రెడ్డి , ప్రచార కార్యదర్శి జాప నాగరాజు, లీగల్ అడ్వైజర్ మాతంగి రవి, కార్యవర్గ సభ్యులు తూముల శ్రీనివాస్, విష్ణు, విజయ్‌కుమార్, రాజిరెడ్డిని ఎమ్మెల్యేతో పాటు పలువురు నాయకులు శాలువాలతో సత్కరించి, అభినందనలు తెలిపారు.



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి

హుజూరాబాద్: గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా ముందుకెళ్లాలని నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. జిల్లా అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు హుజూరాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట మండలాధ్యక్షులను ఆదివారం నియమించారు. హుజూరాబాద్ పట్టణ అధ్యక్షుడిగా మేకల తిరుపతి, మండల అధ్యక్షుడిగా కొల్లూరి కిరణ్ కుమార్, జమ్మికుంట పట్టణ అధ్యక్షుడిగా సుంకరి రమేశ్, మండల అధ్యక్షుడిగా వీరమనేని పర్శరామరావు, వీణవంక మండల అధ్యక్షుడిగా ఎక్కటి రఘుపాల్‌రెడ్డి, ఇల్లందకుంట మండలాధ్యక్షుడిగా పెద్దికుమార్ నియామకమయ్యారు. ఈమేరకు నియామక ఉత్తర్వులు అందజేశారు. పీసీసీ మెంబర్ కృష్ణారెడ్డి, హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్వరిస్వామిరెడ్డి, హనుమాన్ దేవాలయ చైర్మన్ శంకర్, జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్ మల్లయ్య, నాయకులు సాహెబ్ హుస్సేన్, సొల్లు బాబు తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జమ్మికుంట: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బాల్య మిత్రుల సేవా సమితి, 1983–84 పదోతరగతి విద్యార్థులు రూపొందించి క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. జెడ్పీ మాజీ చైర్ పర్సన్ కనుమల్ల విజయ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. బాల్యమిత్రులు సేవా సమితి ఆధ్వర్యంలో సామాజిక సేవలు అందించడం అభినందనీయమన్నారు. సేవా సమితి సభ్యులు మంద వెంకట్ రెడ్డి,గుండా సరేందర్, వట్టిపల్లి శ్రీనివాస్,రేవెల్లి సంపత్‌కుమార్,బత్తిని సాంబయ్య, మట్ట వాసుదేవరెడ్డి, మిత్ర బృందం పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల హర్షం

చిగురుమామిడి: రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా, వ్యవసాయ కూలీలకు ఏటా ఆర్థిక సాయం, నూతన రేషన్‌కార్డులు మంజూరు చేస్తామని ప్రకటించినందుకు పార్టీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం చిగురుమామిడి బస్టాండ్ ఆవరణలో స్వీట్లు పంపిణీ చేశారు. రైతు భరోసా పథకానికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసాగా నామకరణం చేయడం సంతోషించదగిన విషయమని పార్టీ మండల అధ్యక్షుడు, హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి అన్నారు. పథకాలను 26వ తేదీ నుంచి ప్రారంభిస్తామనడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీపీ ప్రధానకార్యదర్శి రవీందర్, జిల్లా అధికార ప్రతినిధి సత్యనారాయణరెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేణుగోపాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు భారతీదేవి, పర్శరాములు, కుతుబుద్దీన్, ప్రవీణ్‌కుమార్, స్వప్న, రాములు, లక్ష్మణ్, వంశీకృష్ణ, పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

జమ్మికుంట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి ఆదివారం తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ధర్మారం రోడ్డులో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేశామని రాసపల్లి రంజిత్, చంద్రగిరి శ్రీకాంత్, సిరిసేటటి రాజు, దుగ్యాల శ్రీకాంత్‌పై కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

కొండంత లక్ష్యం.. వసూళ్లలో నిర్లక్ష్యం

- గ్రామ పంచాయతీల్లో పేరుకుపోయిన పన్నుల బకాయిలు
- మౌలిక వసతుల కల్పనకు, ఇతర అవసరాలకు అప్పులు చేస్తున్న కార్యదర్శులు
- ఎన్నికలకు ముందు దృష్టి సారిస్తే మేలు



పన్ను వసూళ్ల సమీక్షకు హాజరైన కార్యదర్శులు(ఫైల్) పన్ను వసూళ్లు చేస్తున్న కార్యదర్శి(ఇన్‌సెట్లో)

హుజూరాబాద్: గ్రామాలాభివృద్ధికి పన్నుల వసూళ్లే కీలక ఆదాయ వనరు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పంచాయతీలకు నిధులకు రాక పల్లెలు సమస్యలతో సతమతమవుతున్నాయి. ముఖ్యంగా మౌలిక వసతుల కల్పనకు, చిన్నచిన్న మరమ్మతులకు స్థానిక పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేస్తున్నారు. పన్నుల వసూళ్లు పెరిగితే కొంతలో కొంతైనా ఆదాయం సమకూరుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు ఉన్నతాధికారులు ఆర్థిక సంవత్సరం ముగింపునకు మరో నాలుగు నెలలు ముందుగానే కింద స్థాయి అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. సాధారణంగా లేటా ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు ఆర్థిక సంవత్సరంగా పరిగణిస్తారు. ఆర్థిక సంవత్సరం మరో వందరోజులకు పైగా ఉండటంతో లక్ష్యాలను విధిస్తూ పన్నుల వసూళ్లపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామ పంచాయతీలు వారసంతలు, లైసెన్సులు, ఇంటి నిర్మాణ అనుమతులు, బంజరుదొడ్డి తదితర వాటిపై ఏటా ప్రణాళిక ప్రకారం వందశాతం పన్నులు వసూలు చేయాలి. వచ్చిన నగదును ఎస్టీవో కార్యాలయంలో జమ చేసి గ్రామపంచాయతీ అవసరాలు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ, గ్రామసభల ఏర్పాటుకు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

అధికారులు దృష్టి సారించాలి

ఆర్థిక సంవత్సరం ప్రారంభమై ఎనిమిది నెలలు పూర్తయినా పూర్తి స్థాయిలో పన్నుల వసూళ్లపై శ్రద్ధ పెట్టడం లేదు. నిన్నటి వరకు సమగ్ర కుటుంబ సర్వే పనుల్లో నిమగ్నమైన పంచాయతీ అధికారులు ప్రస్తుతం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించే పనిలో ఉన్నారు. మరో నెల, రెండు నెలల్లో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ మొదలైతే పంచాయతీ ఎన్నికలకే సమయం పోతుంది. సమయం మించిపోకముందే వందశాతం వసూళ్లపై అధికారులు దృష్టి సారిస్తే పంచాయతీలకు ఆదాయం పెరుగుతుందనడంలో సందేహం లేదు.

డివిజన్ వ్యాప్తంగా ఆయా మండలాల పన్నుల వివరాలు రూపాయల్లో..

మండలం	గ్రామ పంచాయతీలు	లక్ష్యం		వసూళ్లు		పెండింగ్	
		ట్యాక్స్	నాన్‌ట్యాక్స్	ట్యాక్స్	నాన్‌ట్యాక్స్	ట్యాక్స్	నాన్ ట్యాక్స్
హుజూరాబాద్	19	66,58,238	12,3,500	29,34,284	88,420	37,23,954	35,080
జమ్మికుంట	20	48,63,505	17,01,600	23,25,328	2,40,920	25,38,177	14,67,150
వీణవంక	26	49,55,992	59,38,310	16,66,176	6,72,217	32,89,816	52,66,293
ఇల్లందకుంట	18	26,55,529	32,40,100	15,99,826	8,73,350	10,55,703	23,66,750
సైదాపూర్	26	31,43,823	38,67,360	11,12,524	4,29,724	20,31,299	34,37,636
శంకరపట్నం	6	88,98,345	3,50,400	51,74,494	1,91,357	37,23,854	1,62,957
మొత్తం	115	3,11,75,432	1,52,21,270	1,48,12,629	24,95,988	1,63,62,803	1,27,35,866

ప్రత్యేక దృష్టి సారించాం



ఆయా గ్రామాల వారీగా పెండింగ్ బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాం. వారానికోసారి పన్ను బకాయి వసూళ్లపై కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్నాం. పెండింగ్ బకాయిలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– తూర్పాటి సునీత, ఎంపీడీవో, హుజూరాబాద్

ప్రణాళికతో ముందుకెళ్తాం



లక్ష్యం మేరకు వందశాతం పన్నులు వసూలు చేసేలా ప్రణాళికలు రూపొందించి క్షేత్ర స్థాయిలో సిబ్బందిని అప్రమత్తం చేస్తాం. విషయమైన సంబంధిత అధికారులకు పలు సమావేశాల్లో దిశా నిర్దేశం చేస్తున్నాం.

– పాత శ్రీనివాస్, డీఎల్‌పీవో, హుజూరాబాద్

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

గన్నేరువరం: ప్రజాసంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. గన్నేరువరంలో పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేదలు, రైతులు, మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు ఆర్థికసాయం , కొత్త రేషన్‌కార్డులను ప్రారంభించనున్నామని తెలిపారు. పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు ఎప్పుడు అండగా ఉంటామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనాథ్‌రెడ్డి, కేడీసీసీబీ డైరెక్టర్ కోటీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, డీసీసీ ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కార్యదర్శి సునీల్, డైరెక్టర్లు అనిల్, చంద్రారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, వాసు, మల్లేశం, అనిల్ పాల్గొన్నారు.

మానకొండూర్: ప్రజలు అందరూ మంచి మనస్సుతో మెదులు కోవాలని ఎమ్మెల్యే అన్నారు. అన్నారంలో నిర్మించిన మజీద్ ప్రారంభించారు. ప్రజలందరూ సమానమేనని, కులమత బేధాలు లేవని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అనాడే రాజ్యాంగంలో రాశాడని, కొన్ని పార్టీలు మతం పేరిట విద్వేషాలు సృష్టిస్తున్నాయని ఇది మంచిది కాదన్నారు.



గన్నేరువరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుంటాం

పార్టీ బలోపేతానికి పనిచేసే కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుంటామని, పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తే ఊరుకోబోమని ఎమ్మెల్యే అన్నారు. మానకొండూర్ మండల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం కేఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్లో నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేరస్తుందన్నారు. పార్టీ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు తెలియజేయాలని కార్యకర్తలకు సూచించారు. గ్రామ గ్రామాన పార్టీ నాయకులే గెలిచే విధంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు.

మంత్రి 'పొన్నం'కు వినతి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

జమ్మికుంట: పట్టణానికి చెందిన బేడబుడిగ జంగం జన సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తూర్పాటి లింగయ్య, రాష్ట్ర అధ్యక్షుడు సిరిపటి వేణు ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లో బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం ఆదివారం అందజేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బేడ,బుడిగ జంగాలవారు శుభకార్యాలు, సమావేశాలు, సభలు నిర్వహించుకోవడానికి కమ్యూనిటీ హాల్‌ను వెయ్యి గజాల స్థలంలో నిర్మించాలని కోరామన్నారు. మంత్రి పొన్నం సానుకూలంగా స్పందించారని ,ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యులు చింతల అంజితోపాటు కులస్థులు పాల్గొన్నారు.

సన్మానం

హుజూరాబాద్: పట్టణంలోని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కార్యాలయంలో ఆదివారం మాదిగ కళామండలి జిల్లా అధ్యక్షుడు అంబాల ప్రభాకర్, ఉపాధ్యక్షుడు అందాసి నారాయణను నాయకులు ఘనంగా సన్మానించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఆదేశానుసారం ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే వెయ్యి గొంతులు లక్ష డప్పుల మాదిగల మహా ప్రదర్శనకు జిల్లా నుంచి మాదిగలను సమాయత్తం చేయటంలో అధ్యక్ష, ఉపాధ్యక్షులు కృషి చేసినందుకు సన్మానించారు. మాదిగ డప్పు కళాకారుల మహా ప్రదర్శనకు డప్పు కళాకారులు, గాయకులు, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు తరలి రావాలని కోరారు.

మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లకు...

చిగురుమామిడి: మండల కేంద్రంలో మండల రంగస్థల కళాకారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లను ఘనంగా సన్మానించారు. బస్టాండ్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు ఓరుగంటి భారతీదేవి, బొడిగె పర్శరాములు, ఎండీ కుతుబుద్దీన్ లను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

భూమిపూజ

హుజూరాబాద్: పట్టణంలోని శివాలయానికి ఎదురుగా మినీ కల్యాణ మండప నిర్మాణానికి ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికశ్రీనివాస్ భూమిపూజ చేశారు. భక్తులు, దేవాలయానికి సంబంధించిన వివిధ కార్యక్రమాలు, నవరాత్రి ఉత్సవాలకు ఉపయోగపడే విధంగా మినీ కల్యాణ మండప నిర్మిస్తున్నామని తెలిపారు. దామెర హరికృష్ణ, రమేశ్‌బాబు (రాము), అనురాగ్ రోహిత్, కౌన్సిలర్లు అపరాజ ముత్యంరాజు, ప్రతాప తిరుమల్‌రెడ్డి, ఎస్‌పీఆర్ రెసిడెన్షియల్ స్కూల్ కరస్పాండెంట్ గౌరిశెట్టి జగన్మోహన్, కోటేశ్వరరావు, గోలి కుమారస్వామి, గందె సాయి, భవానీశంకర మహాదేవాలయ అర్చకులు, వేద పండితులు కాట్రపల్లి విశ్వనాథ శర్మ, గాయత్రి బ్రాహ్మణ సంఘ సభ్యులు ప్రతినిధులు హాజరయ్యారు.

అవయవదానంతో వెలుగులు

హుజూరాబాద్: అవయవదానంతో ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపొచ్చని సదాశయ ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ మచ్చగిరి నరహరి అన్నారు. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన గౌరిశెట్టి భవానీ గతేడాది డిసెంబర్ 26న మృతిచెందగా కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆమె అవయవాలు సేకరించారు. ఆదివారం సంస్మరణ సభ నిర్వహించగా అవయదానానికి సహకరించిన మృతురాలి భర్త శ్రీనివాస్‌కు అభినందన పత్రం అందజేశారు. వెంకటేశ్వర్లు, శివానందయ్య, శ్రీనివాస్, జగదీశ్వర్, రమేష్, కాసం నాగరాజు, రావికంటి రాజేందర్‌లకు ఫౌండేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, కార్యదర్శి డాక్టర్ బీష్మాచారిలు ఉన్నారు.

అధిక సంఖ్యలో హాజరు కావాలి

చిగురుమామిడి: ఎస్సీ వర్గీకరణకు సంబంధించి హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న జరిగే లక్ష డప్పులు వెయ్యి గొంతుల మహాసభకు మాదిగలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి రామంచ భరత్‌మాదిగ కోరారు. ఆదివారం చిగురుమామిడిలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వర్గీకరణ చేయకపోవడంతో విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో కొందరికి మాత్రమే న్యాయం జరుగుతోందన్నారు. సమావేశానికి మండల అధ్యక్షుడు తిరుపతి అధ్యక్షత వహించగా జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, ఉపాధ్యక్షుడు శ్రీరామ్, నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

గన్నేరువరం: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఎస్సై తాండ్ర నరేష్ తెలిపారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా హన్మాజిపల్లె ఎక్స్‌రోడ్డులో ఆదివారం వాహనదారులకు అవగాహన కల్పించారు.

హామీల అమలులో విఫలం

ఇల్లందకుంట: హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు రాము అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక హామీలను అమలు చేయడం లేదన్నారు. రైతు భరోసా రాక అధిక వడ్డీ తీసుకుంటూ రైతులు వ్యవసాయం చేస్తున్నారని అన్నారు.

ఆర్థికసాయం

గంగాధర: మండలంలోని కారుపాకలపల్లి గ్రామానికి చెందిన మొగిల్ల రమేశ్ ఇటీవల మృతి చెందగా గంగాధర ఆటో యూనియన్ బాధిత కుటుంబానికి అండగా నిలిచింది. మృతుడి కుటుంబానికి ఆదివారం రూ.ఐదు వేలు, యాభై కిలోల బియ్యాన్ని అందజేశారు.

బెనిఫిట్స్ అందించాలి

జమ్మికుంట: రిటైర్మెంట్ ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి బెనిఫిట్స్ ఏళ్లు అందడం లేదని, డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి అన్నారు. ఆదివారం కోరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ టీచర్ బి. ఉమ ఉద్యోగ విరమణ అభినందన సభలో మాట్లాడారు. డీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందని, తక్కువ బడ్జెట్ కేటాయిస్తుందన్నారు.



సాక్షి స్పందన

చిగురుమామిడి: మండలంలోని సీతారాంపూర్‌లో లీకేజీ అవుతున్న మిషన్‌భగీరథ పైపులైన్‌కు అధికారులు మరమ్మతు చేయించారు. ఈ నెల 3న 'సాక్షి'లో లీకేజీపై వాట్సాప్ కథనం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. అధికారుల ఆదేశాలతో కార్యదర్శి మరమ్మతులు చేపట్టి లీకేజీని అరికట్టారు. ఏడాదిగా పట్టించుకోని అధికారులు 'సాక్షి' ప్రచురితమైన కథనానికి స్పందించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. రైతులకు ఎకరాకు రూ.12వేలు, భూమిలేని రైతు కూలీలకు ఏటా రూ.12వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతోపాటు ఈ నెల 26 నుంచి అమలు చేస్తామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం మండలంలోని మధురానగర్ చౌరస్తాలో నాయకులు, రైతులతో కలిసి ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ తెలంగాణ రోల్‌మోడల్‌గా నిలుస్తోందని, అభివృద్ధిని ఓర్వలేక బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాలతో ప్రజలు ఆందోళనకు గురి కావొద్దన్నారు. ఎన్నికల హామీలతో పాటు మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజిత–శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వేముల భాస్కర్, తోట కరుణాకర్, పురమల్ల మనోహర్, దుబ్బాసి బుచ్చయ్య, తోట సంధ్య, బూర్గు గంగన్న, రోమాల రమేశ్, పడాల రాజన్న, మేర్గ కొండయ్య, పడితపల్లి కిషన్ పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

రామడుగు: మండలంలోని వెలిచాలలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందని, పేదల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. కొక్కెరకుంట సింగిల్ విండో చైర్మన్ ఒంటెల మురళీకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ వీర్ల నర్సింగరావు, పార్టీ మండల అధ్యక్షుడు జవ్వాజీ హరీశ్, జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు శుక్రుద్దీన్, నాయకులు కాడె శంకర్, బొమ్మరవేని తిరుపతి, పంజాల శ్రీనివాస్, జక్కుల బాబు నాయకులు పాల్గొన్నారు.

క్రైం వార్తలు

విద్యుత్ మోటారు చోరీ

ఇల్లందకుంట: మండలంలోని మల్యాల గ్రామసమీపంలోని వాగు వద్ద శనివారం అర్ధరాత్రి దొంగలు వ్యవసాయ విద్యుత్ మోటారు, కేబుల్, స్టార్టర్ పెట్టెను ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన బొమ్మ మహేందర్ ఐదెకరాల్లో వరి పంటను సాగుచేస్తున్నాడు. పంటకు నీరు పెట్టేందుకు ఇటీవల విద్యుత్ మోటారు, స్టార్టర్‌పెట్టెను ఏర్పాటు చేసుకున్నాడు. శనివారం అర్ధరాత్రి దుండగులు వాగుపక్కన ఉన్న విద్యుత్ మోటార్‌ను, కేబుల్ వైర్లు, స్టార్టర్‌ను దొంగిలించారు. అంతేకాకుండా మోటారుకు అమర్చిన పైపులను ధ్వంసం చేశారు. ఆదివారం ఉదయం భూమి వద్దకు వెళ్లిన రైతు చోరీ జరిగినట్లు గుర్తించాడు. గతంలో కూడా గ్రామంలో మోటార్ దొంగతనం జరిగినట్లు బాధిత రైతు వాపోయాడు.

పూరి గుడిసెలు దగ్ధం

ఇల్లందకుంట: గీత కార్మికులకు చెందిన రెండు పూరి గుడిసెలు శనివారం అర్ధరాత్రి దగ్ధం కావడంతో రూ.యాభైవేల వరకు నష్టం వాటిల్లింది. గీత కార్మికులు తెలిపిన వివరాలు.. మల్యాల పరిధిలోని సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద తాటి వనంలో కార్మికులు విశ్రాంతి తీసుకోవడానికి నిర్మించిన రెండు పూరి గుడిసెలు అగ్నికి ఆహుతయ్యాయి. ఆదివారం ఉదయం చెట్లు ఎక్కడానికి వెళ్లిన కార్మికులు దగ్ధమైన గుడిసెలను గుర్తించారు. సుమారు 50 మంది గీతకార్మికుల మోకు, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోగా భారీగా నష్టం వాటిల్లిందని గీతన్నలు ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన ప్రమాదవశాత్తు జరిగిందా లేక వేరే కారణంతో జరిగిందా అనేది తెలియాల్సి ఉందని తెలిపారు.

పశువుల కాపరి అనుమానాస్పద మృతి

రామడుగు: మండలంలోని గుండి గ్రామంలో గంగాధర మండలంలోని సర్వారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ముద్దం లచ్చయ్య (70) అనే పశువుల కాపరి ఆదివారం సాయంత్రం అనుమానాస్పదంగా మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గుండికి చెందిన రైతు రామయ్యకు చెందిన పశువుల కొట్టంలో లచ్చయ్య పడిపోయి ఉన్న విషయం తెలుసుకున్న గ్రామస్తులు చికిత్స కోసం కరీంనగర్ తీసుకెళ్తుండగానే చనిపోయాడని తెలిపారు. కాగా మృతికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధి కొత్తపల్లి సబ్ స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు..హన్మకొండ జిల్లాకు చెందిన బండారి కార్తీక్, దువ్వ హరికృష్ణలు బైక్‌పై కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు వస్తుండగా వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. స్థానికులు క్షతగాత్రులను హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని తెలపగా మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

శంకరపట్నం: మండలంలోని తాడికల్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన ఒడ్నాల వీరయ్య మోపెడ్‌పై రోడ్డు దాటుతుండగా బెల్లంపల్లి నుంచి శ్రీకర్, అరవింద్ బైక్‌పై వరంగల్ వెళ్తూ మోపెడ్‌ను ఢీకొట్టారు. వీరయ్య, అరవింద్(22)కు గాయాలుకాగా ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని కేశవపట్నం పోలీసులు సందర్శించి వివరాలు సేకరించారు.

ఉచిత వైద్య శిబిరం

గంగాధర: మండలంలోని ఉప్పరమల్యాల గ్రామంలో ఆదివారం కరీంనగర్‌కు చెందిన సురక్ష ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ రెండు వందల మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయడంతో పాటు సలహాలు ఇచ్చారు. కీళ్లు, నడుం, మెడనొప్పులు, పోలియో, వంకరకాళ్లు, సయాటికా, స్పాండిలైటిస్ సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆసుపత్రి సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు. శిబిరంలో రాము, కమలాకర్, హరి సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం

ఇల్లందకుంట: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ఇల్లందకుంట మాజీ ఎంపీటీసీ,శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం మాజీ కమిటీ చైర్మన్ పెద్ది కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్‌రెడ్డి, హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్‌బాబు శనివారం ఎన్నికైనట్లు పత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, నాయకులకు కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

'ఏం చేశారని క్షీరాభిషేకం'

గంగాధర: కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని క్షీరాభిషేకాలు చేస్తున్నారో ప్రజలకు వివరించాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, నారాయణపూర్ రిజర్వాయర్‌కు ఎల్లంపల్లి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు సిద్ధం కాగా రవిశంకర్, బీఆర్ఎస్ నాయకులను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మానకొండూర్: కాంగ్రెస్ ప్రభుత్వం మరో సారి రైతులను మోసం చేసిందని, ఓట్ల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కానీ హామీలు ఇచ్చిందని, మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టుతున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మానకొండూర్‌లో బీఆర్ఎస్ నాయకులు ఆదివారం కరీంనగర్ వరంగల్ ప్రధాన రహదారిపై సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేశారు. అనంతరం రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు విలేకర్లతో మాట్లాడారు.